For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified



: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

గౌరవ సంపాదకులు
ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు
ఉపకులపతి (FAC)


ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్



సంపుటి : 3 | సంచిక : 18 | 30-01-2023 | పుటలు : 4


## జనవరి 30
## మహాత్మాగాంధీ వర్ధంతి




జీర్ణ దేహమిది, పూర్ణ తేజమిది
భువన విధిత సత్యాహింస సవన దీక్షాబద్ధ జీవము,
సీతాచలమువలె పూత జాహ్నవి వలె
నిత్య గంభీరము!!

అతడొక పవిత్ర ధర్మదేవాలయంబు!
అతడొక విచిత్ర విశ్వవిద్యాలయంబు!
ఆ మహాశక్తి అంతయింతంచు
తూచజాలమతడొక హిమాలయంబు!!

– నన్నయవాణి

## మంచిమాట

నిన్ను పొగిడేవారి కంటే
నిన్ను కఠినంగా విమర్శించే
వారివల్లనే
నువ్వు అధికంగా మంచిని
పొందగలవు
- మహాత్మాగాంధీ





# నన్నయలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు




**26.01.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఘనంగా 74 వ గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ విభాగం, ఎన్ఎస్ఎస్, బీఈడీ, ఇంజనీరింగ్ విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ స్వతంత్ర భారతాన్ని గణతంత్ర దేశంగా మార్చిన భారత రాజ్యాంగం మహోన్నతమైన రాజ్యాంగమని కొనియాడారు. రాజ్యాంగ కర్తలను స్మరించుకుంటూ వారి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. భారతదేశంలోని ప్రజలందరూ రాజ్యాంగఫలాలు అందుకుంటూ దేశ అభ్యున్నతికి ప్రయత్నించాలన్నారు. ప్రజలందరూ దేశభక్తిని పెంపొందించుకుంటూ దేశ అభివృద్ధికి సమాజ శ్రేయస్సుకు తోడ్పాటు నందించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ తమ విధులను త్రికరణ శుద్ధిగా నిర్వహిస్తూ బాధ్యతగా మెలగాలని సూచించారు. తద్వారా దేశం, విశ్వవిద్యాలయం ప్రగతి పథంలో పయనిస్తుందని తెలియజేసారు. తరువాత విశ్వవిద్యాలయ విద్యార్థులు దేశభక్తితో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ జెండాకు నమస్కరిస్తున్న రిజిస్ట్రార్







## సంపాదకీయం



# గాంధీజీ – ప్రకృతి

ప్రకృతిని చూసి నేను ముగ్ధుణ్ణవుతాను. ఆశ్చర్య చకితుణ్ణవుతాను. అది నన్ను మహదానంద లోకాలకు తీసుకు వెళుతుంది. నాకు ప్రకృతి కన్నా ఉత్తేజం కలిగించే విషయం ఏదీ లేదు.. అంటారు గాంధీజీ. మనిషికి, ప్రకృతికి మధ్య ఎలాంటి సంబంధం ఉండాలని మహాత్ముడు భావించాడో మనకర్థమవుతుంది.

మనిషి తనతో పాటు నివసించే అనేక రకాలైన జీవులకన్నా గొప్ప వాడినని భావించటం అతని అహంభావానికి, పొగరుబోతు తనానికి తార్కాణం. తక్కిన జీవరాశికి లేని కొన్ని విషయాలు అతనికి ప్రాప్తించినందువల్ల జంతురాశికి ఇతర జీవులకు మనిషి ధర్మకర్తలా వ్యవహరించాలని కూడా గాంధీజీ సందేశమిచ్చారు.

గాంధీజీ పర్యావరణ శాస్త్రవేత్తేమీ కాదు. ఆయన జీవించిన కాలంలో పర్యావరణ సమస్య ప్రపంచంలో ముఖ్యమైన స్థానాన్ని పొందలేదు కూడా. అయినా వాటికి సంబంధించిన విషయాలు మాత్రం ఎన్నో ఆయన రచనల్లో పొందుపరిచారు.

భారతీయ సంప్రదాయంలో ప్రకృతికి,మనిషికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. అథర్వణ వేదం భూమిని భూమాత అని ప్రస్తావించి మాతృభావనను కలిగించింది. యజుర్వేదం విశ్వమంతా వర్ధిల్లాలని, వాతావరణంలో భూమండలంలో శాంతి ఉండాలని, జలం ఔషధులు వర్ధిల్లాలనే ప్రార్థన ఉంది. ఇటువంటి స్తుతులు ఒక వ్యక్తి స్వార్థ ప్రయోజనం కోసం కాదు కదా! ఇవాళ మనం Ecosphere అనే సాంకేతిక నామంతో పిలుస్తున్న సమస్త జీవావరణంలోని జీవులన్నీ వర్ధిల్లాలనే కోరికతో చేసే ప్రార్థనలే!

నాకన్నింటికన్నా ముఖ్యమైన విషయం మనిషి. మనిషికి జీవరాశిని సృష్టించే శక్తిలేదు. అందువల్ల వాటిని నశింప చేసే హక్కు కూడాలేదు. ఒక సమాజం ఏ విధంగా ఉన్నదనే విషయం ఆ సమాజం జంతువులపై ఏ విధంగా ప్రవర్తిస్తున్నదన్న విషయంపై నిర్ణయించబడుతుందంటారు బాపూజీ.ఆయన తన అభిభాషణల్లో హరిత వినియోగదారు ఎలా ఉండాలో సూచించారు.ప్రకృతి జమాఖర్చుల పుస్తకం ఎప్పుడు సమానంగానే ఉండాలంటారు. జమ కన్నా ఖర్చు ఎక్కువైతే ప్రకృతికి పూడ్చలేని హాని కలుగుతుంది కూడా.

ప్రకృతి పట్ల మనిషి చేస్తున్న అకృత్యాలకు కలత చెందుతూ మహాత్ముడు పదే పదే పలికిన పలుకుల్ని మార్టిన్ లూథర్ కింగ్ కవితాత్మకంగా ఇలా చెబుతారు... " కొంత కాలం గడిచాక మనం నిస్పృహతో బాధపడవచ్చు కానీ చరిత్ర దానిని వినదు. తన మార్గంలో తాను వెళుతుంది. అనేకానేక నాగరకతల ఎముకలు కలబోసి ఉన్న మార్గంలో అది ప్రయాణిస్తుంది. ఆ ఎముకలన్నింటి పైన ' చాలా ఆలస్యం అయిపోయింది ' అనే విషాద వాక్యాలు రాసి ఉంటాయి. "

"ఆలస్యం" కాకుండానే ప్రకృతిపట్ల శ్రద్ధ వహించే మార్గంలో ప్రయాణిద్దాం! జనవరి 30 గాంధీ వర్ధంతి సమయంలో వారిని స్మరిస్తూ పర్యావరణం పట్ల జాగ్రత్త తీర్మానాన్ని చేసుకుందాం!!

# నేతాజీకి నివాళులు అర్పించిన నన్నయ వీసీ

**23.01.23 (మీడియాసెల్)** నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు నివాళులర్పించారు. సోమవారం యూనివర్సిటీ ఈసీ హాల్ లో నేతాజీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ జి.వి.ఆర్.ప్రసాదరాజు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారత స్వాతంత్ర పోరాటంలో అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని అన్నారు. భావి తరాల హృదయాలలో దేశభక్తిని పెంపొందించిన మహోన్నత యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. తెల్లదొరల పాలన అంతం కావడానికి ఒక్క అహింసా మార్గం సరిపోదని, సాయుధ పోరాట బాట పట్టిన గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన 'ఆజాద్ హింద్ ఫౌజ్' అనే సైన్యాన్ని స్థాపించారన్నారు. భారతదేశంలోని గొప్ప స్వాతంత్ర్య సమరయోధులలో ఒకరిగా పరిగణించబడుతున్న ఆయన శక్తివంతమైన నినాదం "నాకు రక్తం ఇవ్వండి, నేను మీకు స్వేచ్ఛ ఇస్తాను" అంటూ భారతీయులలో దేశభక్తిని ప్రేరేపించారన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ను యువత ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాల కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, విశ్వవిద్యాలయ అధికారులు ఆచార్య కె. శ్రీ రమేష్, ఆచార్య పి.సురేష్ వర్మ, డా.వి.పెర్సిస్, డా.ఎం.కమలకుమారి, డా. కె. సూకరత్నం, డా.ఎం.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ



# కాకినాడ నన్నయ క్యాంపస్‌లో గణతంత్ర వేడుకలు

**26.01.23 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం ఎస్ ఎన్ క్యాంపస్ కాకినాడ మరియు ఆంధ్ర వనవాసి కళ్యాణ ఆశ్రమం సహకారంతో గిరిజన వీరుల ఎగ్జిబిషన్ ని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపల్ డా.ఎం. కమల కుమారి, ఎస్టి కమిషన్ సభ్యులు వదిత్య శంకర్ నాయక్ హాజరయ్యారు. కార్యక్రమంలో గిరిజన సంప్రదాయం దింసా నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే గిరిజన వీరుల త్యాగాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎల్.మధుకుమార్, వనవాసి కళ్యాణ ఆశ్రమం ఉపాధ్యక్షులు ఎం వి వి కె గుప్తా, మాణిక్ రెడ్డి,హెల్త్ కేర్ ఫౌండేషన్ చైర్మన్ డా.ఎం. సత్యనారాయణ, డి. టి. డబ్ల్యు. ఓ. విజయశాంతి, బోధన బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం నన్నయ ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవ వేడుకలలో జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీరమేష్.

# రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ ఇన్చార్జ్ డీన్‌గా రమణేశ్వరి

**23.01.23 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ కు ఇన్చార్జ్ డీన్ గా ఆచార్య కె.రమణేశ్వరిని నియమిస్తూ వీసీ ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరావు ఉత్తర్వులు జారీచేసారు. సోమవారం యూనివర్సిటీ వీసీ కార్యలయంలో వీసీ జి.వి.ఆర్.ప్రసాదరాజు దీనికి సంబంధించిన ఉత్తర్వులను అందజేసి శుభాకాంక్షలను తెలియజేసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని పరిశోధనలకు ప్రాధాన్యం పెరగాలని అన్నారు. పరిశోధనలు, ఫెలోషిప్ లు వంటి అంశాలను రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ పరిధిలోనికి వస్తాయని చెప్పారు. భవిష్యత్ లో పరిశోధనలు, పబ్లికేషన్స్, ఫెలోషిప్ లు వంటి అంశాలలో విశ్వవిద్యాలయం అభివృద్ధిని సాధించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డీన్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, డా.ఎ.మట్టారెడ్డి, డా.పి.విజయనిర్మల, డా.బి.జగన్మోహనరెడ్డి పాల్గొన్నారు.



రమణేశ్వరికి ఉత్తర్వులను అందజేస్తున్న వీసీ

## ప్రతిభా వాణి

# పరాక్రమ దివస్

*(జనవరి 23 సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా)*



'నాకు మీ రక్తాన్ని దానం ఇవ్వండి.. నేను మీకు స్వాతంత్ర్యాన్నిస్తాను" అంటూ స్వాతంత్రం కోసం పోరాడిన భారతీయ స్ఫూర్తి కెరటం, మరణం లేని అమరుడు, భారతదేశానికి కూడా ఆయుధాలతో పోరాటం తెలుసని చాటిచెప్పిన మహెూన్నతుడు, స్వాతంత్ర పోరాటం అహింసా మార్గంలోనే కాదు..వీర మార్గంలో కూడా బ్రిటీషర్లపై పోరాడుదామని పిలుపునిచ్చిన వీరుడు సుభాష్ చంద్రబోస్.

చంద్రబోస్ **1897** జనవరి **23**న ఒరిస్సాలోని కటక్ లో సంపన్నకుటుంబంలో ప్రభావతీబోస్, జానకినాథ్ బోస్ దంపతులకు జన్మించారు. బోస్ తన **16**వ ఏట స్వామి వివేకానంద బోధనలచే ప్రభావితమై చిన్నతనం నుంచి సమాజానికి మేలు చేయాలనికలలుకనేవారు.**1920**లో సివిల్ సర్వీస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన కూడా **1921** ఏప్రిల్ లో భారతదేశ జాతీయవాద కల్లోలాల గురించి విన్న తర్వాత సివిల్ సర్వీస్ ని వదులుకొన్నారు. తర్వాత గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరారు. **1938**లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షులు అయ్యారు. విస్తృత పారిశ్రామిక విధానాన్ని రూపొందించిన జాతీయ ప్రణాళికా సంఘాన్ని ఏర్పరిచారు. తర్వాత గాంధీజీతో విభేదించి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి విడిపోయి ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ని ఏర్పరిచి దేశంలో సమానత్వం,సామాజిక న్యాయానికి కృషి చేశారు.బ్రిటిష్ పాలనను భారతదేశం నుంచి విముక్తి చేయాలనే ఉద్దేశంతో ఇండియన్ నేషనల్ ఆర్మీని స్థాపించారు.**1941**లో ఇండియా నుండి తప్పించుకొని జర్మనీ వెళ్లి, అక్కడ జర్మనీ సోవియట్ యూనియన్ ఈయన దేశాల సహాయంతో భారత స్వాతంత్రానికి అవిశ్రాంతంగా కృషి చేశారు.తర్వాత సింగపూర్ వచ్చి **45** వేల మంది యుద్ధ ఖైదీలతో ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి సమర్థవంతమైన సాయుధదళంగా మార్చారు. తర్వాత బర్మా, అండమాన్లలో బ్రిటిష్ వాళ్ళని తరిమికొట్టి అక్కడ భారతీయ జెండాను ఎగరవేశారు.'ఆజాద్ హింద్ ఫౌజ్','ఢిల్లీ చలో',' జైహింద్' అనే నినాదాలతో భారతదేశం లోపల, వెలుపల మన భారతీయులందరిలో స్వాతంత్ర కాంక్షను కలిగించారు.

నేతాజీ చెప్పిన సూక్తులు, నినాదాలు ఇప్పటికీ దేశప్రజలలో ధైర్యాన్ని,దేశభక్తిని పెంపొందిస్తున్నాయి అనడంలో ఏమాత్రం సందేహం లేదు.అందుకే భారత ప్రభుత్వం ధైర్యానికి మారుపేరుగా నిలిచిన నేతాజీ పుట్టినరోజున "పరాక్రమ దివస్"గా ప్రకటించి గౌరవించింది.

అందుకే నేతాజీ యొక్క అచంచలమైన స్ఫూర్తి, దేశానికి చేసిన నిస్వార్థ సేవను స్మరించుకోవడం, గౌరవించడం ఎంతైనా అవసరం.

- బి.సుశాంత్ కుమార్,
అలుమ్ని,ఆదికవి నన్నయ యూనివర్సిటీ.

# కాకినాడ క్యాంపస్‌లో ఓటర్ల దినోత్సవం



**25.01.23 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎమ్.ఎస్.ఎన్ క్యాంపస్‌లో ఈ నెల 25న రాజనీతి మరియు ప్రభుత్వ పాలనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విభాగ సహాయాచార్యులు డా. మద్దా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు యొక్క ప్రాధాన్యాన్ని గురించి వివరించి భారత రాజ్యాంగం ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతి వయోజనునికి ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య పాలన ప్రక్రియలో పౌరులకు ఉన్న భాగస్వామ్యాన్ని గూర్చి విద్యార్థులకు వివరించారు. కోర్స్ కోఆర్డినేటర్ డా.కొమ్మర జోసెఫ్ స్టీఫెన్ మాట్లాడుతూ గత 72 సంవత్సరాల కాలంలో భారత ఎన్నికల సంఘం సాధించిన విజయాలు మరియు ప్రపంచంలో అత్యున్నత ప్రజాస్వామ్యం అమలులో భారతదేశం సాధించిన ఘనతలను దృశ్యరూపంలో వివరించారు. విభాగ సహాయాచార్యులు డా. కారుచోల హరిబాబు మాట్లాడుతూ ప్రపంచంలో ప్రజాస్వామ్యం- రాజరికం-నియంత ప్రభుత్వ విధానాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సోదాహరణంగా వివరించారు. ప్రజాస్వామ్య ఎన్నికల విధానంలో పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుందని మిగిలిన ప్రభుత్వాలలో పౌరులకు ఓటు హక్కు ఉండదని వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో తమకున్న వ్యక్తిగత అనుభవాలను క్యాంపస్ మేనేజ్ మెంట్ విభాగాధిపతి డా. డి.అజయ్ రతన్, కంప్యూటర్ సైన్స్ సహాయ ఆచార్యులు ఎండి.ఆర్. నదీమ్ ఎన్నికల ప్రక్రియలో తమకున్న వ్యక్తిగత అనుభవాలను తెలిపారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ఎన్నికల విధానం గూర్చి విద్యార్థులకు అవగాహన కల్పించి విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి నైష్పత్తిక ప్రాతినిధ్య ఓటు పద్ధతిలో నమూనా పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఓటింగ్ లో ఆసక్తిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. ఎం. గోపి, డా. శ్రీరామరాజు, డా. శ్రీదేవి, డా. హేమలత, డా. ఉమా రజిత, శ్రీమతి రాధామాధవి, మనోజ్ దేవ, శ్రీనివాసరావు,డా. రాజకుమార్ రెడ్డి, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొని ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు.



# నేషనల్ రైఫిల్ షూటింగ్‌కు నన్నయ టీమ్



**24.01.23 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీలో రైఫిల్ షూటింగ్ మెన్ అండ్ ఉమెన్ టీమ్ సెలక్షన్స్ ను రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్ ప్రారంభించారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన తెలియజేస్తూ ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల నుండి ఇరవై మంది అబ్బాయిలు, అమ్మాయిలు హాజరయ్యారన్నారు. వీరిలో ప్రతిభావంతులైన ముగ్గురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలను ఎంపిక చేసి స్వామి వివేకానంద సుబర్తి విశ్వవిద్యాలయం హరిద్వార్ లో ఫిబ్రవరి 15 నుండి 19 వరకు జరిగే జాతీయ విశ్వ విద్యాలయ పోటీలకు పంపు తున్నారని తెలియజేసారు. రిజిస్ట్రార్ టి.అశోక్‌ను నిర్వాహకులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డ్ కోఆర్డినేటర్ డా.కె.సుబ్బారావు, సెక్రటరీ డా.బి.రామగోపాల్, సొలోమాన్ దేవానంద్, రైఫిల్ షూటింగ్ కోచ్ లు మహమ్మద్ షరీఫ్, షకిల్ తదితరులు పాల్గొన్నారు.

# కిక్ బాక్సింగ్ టీమ్ సెలక్షన్స్



ఆదికవి నన్నయ యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ మెన్ అండ్ ఉమెన్ టీం సెలక్షన్స్ ను తాడేపల్లిగూడెం క్యాంపస్ లో ప్రిన్సిపాల్ ఆచార్య కె. శ్రీరమేష్ అధ్యక్షతన నిర్వహించారు. 2020 సంవత్సరంలో విశ్వవిద్యాలయం తరుపున మెడల్స్ సాధించిన భవాని శంకర్, ప్రవీణ్ కుమార్ లు ఈ పోటీల నిర్వహణలో పాల్గొన్నారు. ఈ పోటీలకు ఆయా కళాశాల నుండి 20 మంది అబ్బాయిలు, అమ్మాయిలు హాజరుకాగా వీరిలో ప్రతిభ కనపరచిన 11మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఉత్తర ప్రదేశ్ లోని బహదూర్ విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 14 నుండి జరిగే జాతీయ విశ్వవిద్యాలయాల పోటీలకు వీరు హాజరవుతారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డా. బి రామగోపాల్, మెంబర్ హబీబ్ బాషా, సిహెచ్ చంద్రశేఖర్, ఎం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# నన్నయలో ఆర్ట్ ఎగ్జిబిషన్



**28.01.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ డా. బి.ఆర్ అంబేద్కర్ సెంటర్ లైబ్రరీ లో ఆర్ట్ ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ ఓఎస్డి ఆచార్య టేకి జ్యోతి ప్రజ్వలన చేసి ఆర్ట్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డా. బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు పి.సి. ప్రసాద్ ఆర్ట్ గ్యాలరీ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 19, 20, 21 తేదీల్లో అమలాపురం పట్టణంలో నేషనల్ ఆర్ట్ క్యాంప్ నిర్వహించారని ఈ క్యాంపు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 20 మంది అత్యుత్తమ చిత్రకారులు పాల్గొని తమ ప్రతిభతో అందమైన చిత్రాలను చిత్రీకరించారని చెప్పారు. వీటిని యూనివర్సిటీ లైబ్రరీలో విద్యార్థులు, ఆధ్యాపకులు, స్థానిక ప్రజల సందర్శనార్థమై ఆర్ట్ ఎగ్జిబిషన్ గా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. కళలు మానవాళికి ఎంతో అవసరమని, మనోవికాసానికి, మానవ మనుగడకు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలను, ప్రతిభావంతులను యూనివర్సిటీ ప్రోత్సహిస్తుందని తెలిపారు. చిత్రకారుడు పిసి. ప్రసాద్ మాట్లాడుతూ ఆర్ట్ ఎగ్జిబిషన్ కు సహకరించిన వీసీ ఆచార్య జివిఆర్ ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ఆచార్య టి అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి విశ్వవిద్యాల అధికారులు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అసిస్టెంట్ లైబ్రేరియన్ డా. టి సింహాచలం, నన్నయభారతి కోఆర్డినేటర్ డా. తలారి వాసు, ఫ్యాకల్టీ అసోసియేట్ శ్రీరాజరాజేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.

## నిలిచిపోయే దారి!!



నువ్వు ప్రయాణించే దారిలో...
ముళ్ళు,రాళ్లు ఉంటే ఏరేసిపో
నీ వెనక వచ్చేవారికి మంచిదారి అవుతుంది!
నువ్వు ప్రయాణించే దారిలో...
ఆపదలో ఉన్నవారికి సహాయం చేయి
వాళ్ళ ఆశీస్సులు నీకు విజయాన్ని ఇస్తాయి!
నువ్వు ప్రయాణించే దారిలో...
నీడనిచ్చే ఒక మొక్కను నాటు.
అది ఆ దారిలో చాలామందికి నీడనిస్తుంది!
నువ్వు ప్రయాణించే దారిలో...
ఎన్ని అడ్డంకులు ఎదురైనా ముందుకు సాగిపో
అది నీ తోటివారికి ప్రేరణగా నిలుస్తుంది!
నువ్వు ప్రయాణించే దారిలో...
కారుచీకట్లు ఉంటే చిరుదివ్వెను వెలిగించు
అది కోట్ల మందికి వెలుగునిస్తుంది!
నువ్వు ప్రయాణించే దారిలో...
అక్షరాలను నీ గుర్తుగా వదిలిపో
నువ్వు కలకాలం చరిత్రలో ఒక మంచిమనిషిగా
నిలిచిపోతావు!!

– బి.సుశాంత్ కుమార్

# ఫ్రెషర్స్ పార్టీ చిత్రమాలిక

ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ పార్టీ వేడుకను నిర్వహించారు. ఎంబీఏ, ఎంబీఏ టూరిజం అండ్ హాస్పిటాలిటీ, ఎం కామ్ కు చెందిన సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు.










ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in